మబ్బూ వానా మల్లె వాసనా

లక్ష్మీనారాయణ

తెరమీద మధుబాల సిగపూలసొగసు చూడగానే మాధవరావులో ఒకమధురానుభూతి కలిగి, యతిప్రాసయుతమైన వాక్యంలా రమణీయరూపం ధరించి, తీరనికోరిక అంతపెద్ద కెరటంలా లేచి, అందంగా విరిగిపడి మనసును కలవరపరిచింది. సీత, వెన్నెల, మల్లెపూలు, అందమైన ఊహాలు, మబ్బూ, వానా ఇలాటివన్నీ అతనికి గబగబా జ్ఞాపకం వచ్చేశాయి. ఇంటికి బయలుదేరాడు.

*　　　*　　　*

మాధవరావుకి మల్లెపూలంటే ఇష్టం.

“సీతా! నువ్వు జడలో మల్లెపూలు ముడుచుకుంటే ఎంత బావుంటావనుకున్నావ్! పిల్లతెమ్మెరలు ఆమల్లెల చల్లటి పరిమళాన్ని మెల్లిగా, నా నాసాపుటాలకు విందుగా అందచేస్తుంటే ఎంత బాగుంటుందో – ఈ లోకమే మరచిపోతా!— అదొక మధురానుభూతి” అని మాత్రం ఎప్పుడూ అనలేదు. అతనికి అలాటి మాట లాట్టే పయించకపోవడం ఒక కారణం.

రెండోది-తన అర్ధాంగి పవరం వాడుతుంది. అందుకని “నీపవరంలోని పువ్వులు” అని వాక్యం సవరించాలి. దాంతో పొయెట్రీ కాస్తా పోనేపోయె.

‘టంటింటం టింటంటం’ అన్నాడు మాధవరావు; హీరోదగ్గరనుంచి వచ్చిన ఉత్తరాన్ని గుండెలకి హత్తుకుంటూ ‘ఆట పాట’లో హిందీ హీరోయిన్ పాడిన

పాటను యథాశక్తి అనుకరిస్తూ.

ఇంకో నిమిషం తరవాత తలుపు తాళం తీసి, లోపల బల్లమీద పడేస్తూ "టింటర టింటం టరటరటం" అని కూడా అన్నాడు. ప్రస్తుతం సీత ఇంట్లో లేదు కాబట్టి ఇంకో నాలుగు టరటాలు కలిపి పాడినా ఫరవా లేదు.

ఆఫీసునుంచి తిన్నగా సినిమా కెళ్ళి హోటలువాడు "ఇది అన్నమే" అని హామీ ఇచ్చిన పదార్థాలను వాడు నొచ్చుకు పోతాడేమో అని తనుకూడా అది అన్నమేఅని నమ్మేసి, తిని ఇంటికి వచ్చాడు.

సీత ఉదయం బయలుదేరి పక్కఊళ్లో చుట్టాలింటి పెళ్ళికి వెళ్ళింది. రేపో ఎల్లుండో వస్తుంది.

రాత్రి పదిన్నరవుతోంది.

"వెదర్ యమగా ఉంది" అనుకున్నాడు. ఉంగవల్లి తెగించి గోల్డుఫ్లేకుపెట్టె కొనేశాడు మాధవరావు. రూపాయినోటు తీసుకుని మళ్ళీ లిక్కలిక్కమని అణాచిల్లరివ్వట మేమిటని, అడక్కుండానే కొట్టువాడు డిలక్సు అగిపెట్టె చేతులో పెట్టాడు. పిల్లలుకలవాడు-పోనీలే అని మాధవరావు అడ్డు చెప్పలేదు.

సిగరెట్టు వెలిగించి, లైటార్పి, పక్కమీద పడాడు-బయట గాలి జోరుగా వీస్తోంది. కొద్ది నిముషాలకి చినుకులు ప్రారంభించాయి. పొడినేల మీద తొలి చినుకులు పడగానే వచ్చిన వాసనకి మాధవరావు ముగ్ధుడయి పోయాడు. "హా! మల్లెపూల వాసనకంటే బావుందే" అనుకున్నాడు.

వారం రోజుల క్రితం సంగతి గుర్తొచ్చింది.

* * *

తెల్లారి అయిదింటికి వాన మొదలెట్టింది. వానంటే కూడా మాధవరావుకి ఎంతో ఇష్టం. పెళ్ళవని రోజుల్లో, వానొచ్చినపుడల్లా, పక్కన తనకిష్టమయిన చక్కటి అమ్మాయి చెక్కిలికి చెక్కిలి ఆనించి మరీ వానని చూడాలనుండేది.

పెళ్ళయిన తరువాత ఒకరోజు వాన రాగానే ఆసంగతి గుర్తొచ్చింది. ఇపుడు సీతని లేపి, చెంపకిచెంప ఆనించి వానని చూద్దామని అనుకుంటే, నిద్దరమత్తులో ఆ అమ్మాయి కంగారుపడచ్చు. అయినా లేపాడు.

"ఊఁ" అంది సీత కళ్లు తెరవకుండానే.

"వాన" అన్నాడు తను.

"కిటికీ తలుపులు మూసేయండి. జల్లు కొడుతుంది" అంది సీత.

మాధవరావుకి చిరాకేసింది.

"అఛ్ఛే అదికాదు. కిటికీదగ్గరకూచుని వానచూద్దాంరా. లే" అన్నాడు కోపంగా.

సీత ఆవులించింది. "బావుల్దిడ్డీ—హాయ్—అదేబావుల్ది. అద్దరాత్రివేళ అంకమ్మ శివాలన్నట్టు. చాల్లాలు. పడుకోళ్ళి" అంది—అటువేపుతిరిగి.

"టెక్నికల్ అబ్జక్షను. అర్థరాత్రికాదు—ఇపుడు అయిదయింది—తెల్లారి—"అన్నాడు ఇంకా కోపంగా.

సీతకి ఇవేమీ వినిపించినట్టు లేదు.

మండిపోయాడు మాధవరావు.

దడదడా లేచి కోపంగా పళ్ళుతోమేసి (తనవి) ముఖం కడిగేసుకుని, అంతకన్న కసిగా పదహారు అగ్గిపుల్లల సాయంతో కుంపటి అంటించిపారేశాడు. మళ్ళీ తెచ్చి వంటింట్లో పెట్టి వసారాలో కొచ్చాప్పటికి గూట్లో పాలగిన్నె .ఖాళీగాకనిపించింది. ఇంకా పాలవాడు రాలేదు—వానపడటం మూలాన్ని. వాడూ బహుశా వాడితాలూకు అర్ధాంగిచెంపకి చెంపానించి వానని చూస్తున్నాడేమో! వాడిబొంద—వాడికి రొమాన్సేమిటి. కల్చరుండదు—బహుశా. బియ్యే గియ్యేచదివాడా ఏడిశాడా...మాధవరావు నిశ్శబ్దంగా చిన్నకథాకళి నృత్యం చేసి పడక్కుర్చీలోకూచుని నిద్దరోయాడు.

* * *

ఇపుడాసంగతి ఆలోచించుకుంటూంటే ఆరోజు ఎప్రోచ్ బాగులేదనిపించింది.

"అసలలాకాదు, మృదువుగా మాట్లాడి ఉండాల్సింది" అనుకున్నాడు.

బయట వానజోరుకొంచెం తగ్గింది. కిటికీలోంచి వచ్చేగాలికి దుప్పటీ మడతపడింది. సిగరెట్టు బయటకివిసరి, దుప్పటి సరిచేసి తలగడామీద తలఆన్చాడు.

మల్లెపూల వాసన గుప్పుమంది.

నిన్నరాత్రి, సీత, పక్కింటివారి అమ్మాయి తెచ్చిపెట్టినవీ, తను అంతకు ముందే కొన్నవీ కలిపి జడలో రోజాకంటె మరిన్ని పూలు తురుముకొంది. వాటి తాలూకు పరిమళం తలగడాని అంతటా అలముకొని, జవరాలిని కంచుకంలా గాఢాశ్లేషం చేసుకుందనిపించింది. మర్నాటికీ ఆ పరిమళం అలాగే ఉండటం గమనించిన మాధవరావులో తక్షణం మనోహరమైన ప్రణయ భావాలు, మధుర స్మృతులు మెదిలాయి.

అమాంతం సీత అంటే ప్రేమ పెల్లుబికింది.

* * *

తను మొదటిమాటుగా పెద్దపండుక్కి అత్తారింటి కెళ్ళినపుడు, గుమ్మందగ్గర మల్లెపూలు చేరం చేస్తున్న సీత అపుడే రిక్షాదిగిన తన్ను చూడగానే బోలెడు సిగ్గుపడిపోయి గబుక్కున లేచి, గడప తగిలి బోర్లాపడినంత పనిచేసి, వసారా తుడుస్తున్న పని మనిషిని ఢీ కొట్టి, పడిపోకుండా నిలదొక్కుకుని లోపలికి పరిగెత్తికెళ్ళి పోయిన సందర్భం తలచుకొని తక్షణం తనూ బోలెడు సిగ్గుపడి పోయాడు. ఆ మైకంలోనె రిక్షావాడు 'పావలా ఇప్పించండి' బాబూ, అని అడుగుతూంటే, ఇంతకంటె వచ్చినా దమ్మిడీ ఇవ్వనని వాడి చేతులో పరాగ్గా అర్ధరూపాయి కాసు పెట్టేశాడు తను.

రాత్రి డాబాలో వెన్నెల కింద పక్క వేశారు. భోజనాలయిన తరువాత, మామగారు, తనకొచ్చిన జలుబుగురించి చెబుతూ, అణ్వస్త్ర పరీక్షలూ, వాటి దుష్ఫలితాలూ, వివరించి, అమెరికానూ, బ్రిటన్నూ, తలవాచేట్టు తిట్టారు. అసలు ఇలాటి ఏటంబాంబులు మనపూర్వులు ఎప్పుడో కనిపెట్టి పారేశారని చెప్పి ఆయన బోల్డు గర్వపడిపోయాడు. మళ్ళీ లేచి, కాశ్మీరం మీదికి దండయాత్ర ఆరంభించే టప్పటికి, మాధవరావు వెకిలినవ్వు నవ్వేసి, చప్పట్లుకొట్టినంత గట్టిగా చిటికెలు వేస్తూ ఆవలింతలు అభినయించేసరికి విముక్తి లభించింది.

భోజనం అయి పదిహేను నిముషాలయింది. అంతవరకూ సిగరెట్టే కాల్చలేదే! డాబామీదకు వెళ్తూనే వరసగా రెండు కాల్చేసి అయిన కాలనష్టం భర్తీ చేశాడు.

తెల్లటి వెన్నెలక్రింద, తెల్లటి పక్కమీద పాల కెరటం లాటి మెత్తటి తెల్లటి దుప్పటీ—దుప్పటీమీద ఆకెరటపు నురగలా తెల్లటి మల్లెపూలు—"ఓహో! ఏమి టేస్టురా" అనుకుని గుండెలు బాదుకున్నాడు. "యువర్ టేస్టు" అని తనే జవాబు చెప్పుకున్నాడు.

సరే—తరువాత మెట్లమీద గాజుల గలగల, దరిమిలా కనబడిన సీత మొహం కలకల, ఆమొహం తాలూకు కౌతుకకళ్ళ మిలమిలా, ఆపైన శబ్దాలంకారం కోసం ఆమె చేతి మరచెంబు తళతళా మొదలైన ఏర్పాట్లు చూసి మాధవరావు మురిసి పోయాడు.

* * *

వర్షజలంతో శుభ్రంగా కడిగివేసిన నక్షత్రాలను, పల్చటి మబ్బు తెరలలోంచి చూస్తూఉంటే, ఆతారలు మరింత మనోహరంగా తియ్యటి తొయ్యాలి గురించిన మధుర భావాలలా కనిపించి అనిపించాయి.

లోగడ తాను చూసిన హిందీసినిమా తాలూకు హీరోలాగ, తను వదలిన సిగరెట్టు పొగలోకి ఫొటోజెనిక్ గా చూస్తూ "ఇవే గాబోలు—మధుర స్మృతులంటారు హారినీ!" అనుకున్నాడు మాధవరావు.

"అంటే అన్నారుగాని ఇవన్నిటిని లేక వీటన్నిటినీ సీతకు గుర్తు చెయ్యాలి. చేసి ఆమె ముఖంమీద కనబడే సిగ్గుదొంతర్లు చూడాలి. ఆమె పెదాలమీద పూచే అలతినవ్వుల పువ్వులను ఆఘ్రాణించి అలాటి చిరునవ్వు నవ్వినందుకు ఆ పెదాలను యథాశక్తి సత్క—

(51-వ పేజీ చూడండి)

దెబ్బకు దెబ్బ

(7-వ పేజీ తరువాయి)

మౌనంగా కరన్ కేసి తిరిగి "ఏం నా విగ్గులో అంతనవ్వ దగినదేముంది?" అన్నాడు. "అబ్బే! విగులో ఏముంది? మీ తలకాయే!" అన్నాడు కరన్.

చార్లెస్‌లార్డ్ రసెల్ అనే ప్రముఖ బ్రిటిష్ బారిస్టరు (1832-1900; ఈయన ప్రధాన న్యాయమూర్తికూడా అయినాడు.)ను ఒకరోజున మరొక బారిస్టరు అడిగాడు: "ఇద్దరు భార్యలను చేసుకుంటే పడే శిక్ష ఏమి"టని.

"ఇద్దరు అత్తగార్లు!!" అని రసెల్ తక్షణమే సమాధాన మిచ్చాడు.

ఒకసారి ఒక ఐరిష్‌జడ్జి వాది ప్రతివాదులను చూసి "ఇంత చిన్న కేసుకోసం కోర్టు కెందుకొచ్చారు? బయటే మీ తగాదా పరిష్కరించుకోలేకపోయారా?" అని అడిగాడు. అందులో ఒకడు "ఆ పనే చేస్తున్నా మండి. ఇంతలో పోలీసులొచ్చి మమ్మల్ని లాక్కుపోయారు!" అన్నాడు.

ఆస్వాల్డ్ అనే న్యాయవాది లార్డ్ ఇషర్ అనే జడ్జికి ఒకసారి చక్కని రిపార్టీ ఇచ్చాడు. ఆస్వాల్డు ఏదో అప్పీలు విషయమై వాదిస్తున్నాడు. జడ్జి ఈ వాదంతా ఏమిటని చాలా చిరాకు పడుతున్నాడు. చివరికి "ఇదంతా దేనికయ్యా చెబుతావ్. జడ్జీలకి కూడా కాస్త లోకజ్ఞానం ఉంటుందని ఎందుకనుకోవు?" అనేశాడు.

ఆస్వాల్డు "నేను కిందికోర్టులో చేసిన పొరపాటే అదండి" అని తక్షణమే కొట్టాడు.

* * *

ఎన్నికల ప్రచార సమయాల్లో కూడా 'రిపార్టీలు' ఒక్కొక్కసారి బ్రహ్మాండంగా పడతాయి. బానిస వ్యాపారానికి వ్యతిరేక ప్రచారం చేస్తున్న చార్లెస్ బర్లీ అనే ఆయన ఒకసారి సభలో మాట్లాడుతుండగా బాగా కుళ్లిపోయిన కోడిగుడ్డొకటి సూటిగా వచ్చి ఆయన మొహాన చితికింది. తాపీగా జేబురుమాలతో మొహం తుడుచుకుంటూ "బానిస వ్యాపారం ఉండాలనే వారి వాదన ఒక్కటీ సరైంది కాదని నే ననడానికి నిదర్శనం ఇదే," అన్నాడాయన వెంటనే.

ఒకానొక అభ్యర్థి తనకు ఓటిమ్మని అర్థిస్తూ సభలో మాట్లాడుతున్నాడు. సభలోంచి ఒకడు "నువ్వు సాక్షాత్తు దేవదూత గేబ్రియల్‌వైనా నా ఓటు నీకివ్వను." అన్నాడు. దానికా అభ్యర్థి తమకముకోకుండా "నేనే దేవదూత గేబ్రియల్‌నైతే నీ పేరు వోటర్ల జాబితాలో ఉండనే ఉండదు" అని బదులు చెప్పాడట.

ఒక ఎన్నికల ప్రచార సభలో అభ్యర్థి ప్రసంగిస్తున్నాడు. అతడు పాపం ఎంత ఆవేశంగా మాట్లాడేస్తున్నా ఎవరూ వినిపించుకోడంలేదు. వాళ్లల్లో కొంచెమైనా ఉత్సాహ పరచాలని ఆ అభ్యర్థి "చరిత్రలో ఎప్పుడూ కనీ వినీ ఎరగనంత పెద్ద మెజారిటీతో గెలిపించినఖ్యాతి ఈ నియోజకవర్గానికి రావాలంటే ఏం చేయాలి?" అని ప్రశ్న వేశాడు. "ఇంకో అభ్యర్థిని నిలబెట్టాలి" అని సమాధానం వచ్చింది.

ఒకానొక యుద్ధకాలపు ఆస్పత్రిలో ఇది జరిగింది: అందమైన నర్సును చూసి రోగి "నేను బాగుపడినతర్వాత నన్ను పెళ్లి చేసుకుంటావా?" అని అడిగాడు "తప్పకుండా!" అన్నది నర్సు.

"అయితే నన్ను ప్రేమిస్తున్నావన్న మాటేనా?"

"లేదు. మామూలుగా రోగులందరి దగ్గిరా ఇలాగే అంటూ ఉంటాను. లేకపోతే రోగులు మరీ బెంబేలు పడిపోతారు."

"నైంటీంత్ సెంచరీ" అనే పత్రిక సంపాదకుడైన సర్ జేమ్స్ నోల్స్ రిపార్టీలో సిద్ధహస్తుడు. లూతర్ మన్‌డే అనే రచయిత "నేనెందుకు బ్రతికి ఉన్నాను?" అనే ఒక పద్యం పత్రిక్కి పంపించాడు. దానికి సర్ జేమ్స్ సమాధానంగా "మీరు స్వయంగా తీసుకొచ్చి ఇవ్వకుండా పోస్టులో పంపించారు గనుక!" అని వ్రాశాడు.

[సర్ ఎడ్వర్డ్ పలివాన్ వ్యాసం ఆధారంగా.] ★

★ మబ్బా వానా మల్లె వాసనా ★

(9-వ పేజీ తరువాయి)

రించాలి, ఆఁ!" అనుకున్నాడు మాధవరావు. "రానీ చెప్తా" అని గట్టిగాఅన్నాడు. వచ్చే దాకా నిదరపోవచ్చు ననుకుని మెల్లిగా నిద్రకు ఉపక్రమించాడు.

మర్నాడు సాయంకాలం ఆఫీసునుంచి ఇంటికి వచ్చేప్పటికి సీత వచ్చేసింది.

మొహం కడుక్కుని కాఫీ తాగుతూ తను చెప్పదలచుకున్నది చెబుదామనుకున్నాడు గానీ, ఆ అమ్మాయి చాకలాడికి బట్టలేస్తోన్నదని చూసి, ఇది మంచిసమయము కాదు' అనుకుని విరమించుకున్నాడు. భోజనాదికాలు పూర్తిచేసిన తరువాత వెన్నెలలో అయితే భేషుగ్గాఉంటుందని నిర్ణయించుకున్నాడు.

సీత, వంటిల్లుకడిగి ముగ్గెట్టి, తాళంవేసి వచ్చి, పక్కనకూచుని తమలపాకు చిలకలు చుట్టి నోట్లో వేసుకుంటోంది.

మాధవరావు 'రైటో' అని పుంజుకున్నాడు. వెంటనే సరళపదప్రవాహం ఉహూ సెలయేరులాగ వెలువడకపోయినా, ఉపోద్ఘాతంగా గొంతు సవరించుకుని పకిలించాడు' "ఏమిటి—ఆఁ!" అన్నాడు.

నోరు తమలపాకులు నమలడంలో పూర్తిగా నిమగ్నమయి ఉన్నందున కళ్ళతోనే 'ఏమిటి' అంది సీత. అని జవాబుకి ఎదురుచూడకుండా తమలపాకుల పళ్ళెం, దక్కపొడిభరిణా బీరువాలో పెట్టడానికి ఆకేవెళ్ళింది.

కాసేపు తెల్లబోయి తమాయించుకుని "సీతా—ఇలారా" అన్నాడు మాధవరావు.

దగ్గరకొచ్చింది సీత.

సీతని దగ్గరగా చూడగానే తాను చెప్పదలచుకున్నది అప్పటికి వాయిదా వేసి "పెళ్ళి బాగా జరిగిందా" అన్నాడు.

"ఆ! పెళ్ళికేం. దివ్యంగా జరిగింది. మీరు రాలేదని చాలా ఇదయ్యారు కూడాను" అంది సీత—మళ్ళీవెళ్ళి బీరువా తలుపు మూస్తూ.

మాధవరావుకి చిరాకేసింది. సీతమీద కోపం వచ్చింది.—ఆ మాత్రం అర్థం చేసుకోదేమని.

కుదుటపడి, ఫ్లాష్‌బాక్‌తో ఆరంభింపడం మంచిదని "నేను పెద్దపంక్తి మీ ఇంటికొచ్చినపుడు గుర్తుందా—" అన్నాడు.

"లేకేం. అన్నట్టు అపుడు మా అమ్మ నాకు పెటినచీర గుర్తుందా? ఎర్రంచు బార్డరు నల్లముక్కలు ఉంటాయి. అలాటిదే మగ పెళ్ళివాళ్ళు పెట్టారండీ నిన్న పెళ్ళిలో పదిహేను రూపాయలు తక్కువలోనే కొన్నారుటండీ అపుడు మా అన్నయ్యకి చెప్పా కూడాను—వెళ్ళి మళ్ళీ సరిగ్గా ధర కనుక్కురారా అని. బడుద్ధాయి వింనే లేదు. బావుండదే — తీసేసుకున్నాంకదా అని సణిగాడు. కానీ భలే ఉందండీ..."

"మంచి సిగ్ళ్ళు! మంచి సిగ్ళ్ళు!!" అన్నాడు మాధవరావు.

తెచ్చిచ్చి వక్కపొడి ఎక్కమీద వాలింది సీత "నిన్న రాత్రంతా నిద్దరలేదూ" అంటూ.

మాధవరావు పిడికిళ్ళు బిగించాడు. పళ్ళు నిశ్శబ్దంగా కొరికాడు. ఆఖరి ప్రయత్నం చేశాడు—గొంతుకని సాధ్యమైనంత మెత్తగా వినబడేట్టుచేయ ప్రయత్నిస్తూ.

"సీతా! నిన్నరాత్రి తెలగజాలమోద తల అన్నగానే వాసన..."

"అబ్బే మానిపోయాయండీ—ఇవాళ చాకలాడికి వేసేశా కొత్తవి తొడిగాలెట—హాయ్—పడుకోండి బాబూ నిదరొస్తోంది" అంది సీత ఆవులిస్తూ.

"రైటార్పేయండి బాబూ కాస్త" అని కూడా అంది.

"ఎర్రంచు బార్డరు—హుఁ!" అని సణుక్కుంటూ స్విచ్చిదగ్గర కెళ్ళాడు మాధవరావు. ★